ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

- నోరు తెరుచుకున్న పురాతన బావులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

మణికొండ: గ్రామాలు, పట్టణాలలో ఉన్న పురాతన బావులు, బోరు బావులను గుర్తించి వాటిని మూసి వేయాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా నార్సింగి మున్సిపాలిటీ అధికారులు ఆ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. మున్సిపాలిటీ కేంద్రంలోనే ప్రధాన రోడ్లు, నిర్మాణ స్థలాలలో ఉన్న వాటిని నిర్లక్ష్యంగా వదిలేశారు. దాంతో మంగళవారం బన్నీ(6) అనే బాలుడు ఓ బావిలో పడి తన ప్రాణాలను వదిలాడు. తల్లితండ్రులకు ఇద్దరు కుమార్తెల తర్వాత జన్మించిన కుమారుడు స్థల యజమాని, మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యంతో నోరు తెరుచుకుని ఉన్న బావిలో పడి మృత్యువాత పడ్డాడు.



మరో వీధిలో రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్న బావి

మంచి రోజు చూసి మూసేలోపే..

నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని మర్పల్లి కుటుంబానికి చెందిన పురాతన స్థలాన్ని ఇటీవల సోదరులు పంచుకున్నారు. ఒకరు అమ్ముకోగా మరొకరు నిర్మాణం చేపట్టారు. నిర్మాణం చేసేందుకని పురాతన గోడలను తొలగించారు. దాంతో రోడ్డుకు దూరంగా గోడల మధ్య కనిపించకుండా ఉన్న బావి కాస్త బయటకు వచ్చింది. దాన్ని మూసేందుకు మంచి రోజు కోసం ఎదురు చేస్తున్నారు. అప్పటి వరకు చుట్టూ ప్రహరీ కట్టి కనిపించేలా చేశారు. వాటిపై పూర్తి స్థాయిలో కప్పు వేయకపోవటం, వేసిన జాలీనెట్, రెండు కట్టెలు అక్కడ బావి ఉందనే విషయాన్ని కనిపించకుండా చేశాయి. దాంతో అటుగా వెళ్లిన బాలుడు అందులో పడి మృత్యువాత పడ్డాడు. నెల రోజుల క్రితం అదే బావిలో కుక్క పడటం, వెంటనే బావిని పూడ్చివేయాలని స్థానికులు కోరినా స్థల యజమాని మీ పిల్లలను మీరే జాగ్రత్తగా చూసుకోవాలని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని అక్కడి వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదట్లోనే అధికారులు పురాతన బావులపై దృష్టి సారించి ఉంటే ఓ చిన్నారి ప్రాణాలు దక్కేవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.



బాలుడు పడి మృతి చెందిన బావి ఇదే..

విద్యాభివృద్ధికి సర్కారు పెద్దపీట

విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి

శంషాబాద్: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి తెలిపారు. పట్టణంలో 1.20 కోట్లతో నిర్మాణం చేసిన నూతన గ్రంథాలయ భవనంతో పాటు ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో రూ. 80 లక్షల నిధులతో అదనపు గదుల నిర్మాణం పనులకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయ భవనాలు నిర్మాణం చేసుకోవడంతో పాటు మరమ్మతుల పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఆధునిక హంగులతో నిర్మాణం చేసిన గ్రంథాలయాన్ని విద్యార్థులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శంషాబాద్ గ్రంథాలయంలో 60 వేల పుస్తకాలు ఉన్నాయని ఇంకేమైన పుస్తకాలు అందుబాటులో లేకపోతే మూడు రోజుల్లోనే వాటిని గ్రంథాలయ సంస్థ సమకూరుస్తుందన్నారు. పెండింగ్‌లో జూనియర్ కళాశాల అదనపు గదుల నిర్మాణంతో పాటు డిగ్రీ కళాశాలకు భవన నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ శ్రీధర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ వెంకటరమణారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ సుష్మ, వైస్ చైర్మన్ బండిగోపాల్ యాదవ్ పాల్గొన్నారు.



నూతన గ్రంథాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి

'మేనేజ్'లో జై జవాన్-జై కిసాన్



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు మాజీ సైనికులు

ఏజీవర్సిటీ: మాజీ సైనికులు ఆర్మీ, నేవీ, వైమానిక దళ అధికారులను నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్) ద్వారా అగ్రిప్రెన్యూర్స్‌గా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం జై జవాన్ కిసాన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని దీంట్లో అన్ని రాష్ట్రాల నుంచి రిటైర్డ్ అయిన సైనికులను తీసుకోవడం జరిగిందని మేనేజ్ డైరెక్టర్ జనరల్ చంద్రశేఖర అన్నారు. బుధవారం (మేనేజ్)లో జై జవాన్ జై కిసాన్ కార్యక్రమానికి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవీ విరమణ తర్వాత చాలా మంది వ్యవసాయం చేయడానికి సిద్ధపడుతున్నారని వ్యవసాయం లాభసాటిగా ఉండాలని వారు కోరుకుంటున్నారన్నారు. వీరికి వ్యవసాయంలో అధునాతన పరికరాలతో నూతన పద్ధతులను అవలంబిస్తూ వ్యవసాయం ఎలా చేయాలనే దానిపై శిక్షణ అందించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పదవీ విరమణ పొందిన సైనికులకు సెకండ్ ఇన్నింగ్స్‌గా వారికి అద్భుతమైన కెరీర్‌ని ఇవ్వడానికి కేంద్ర మంత్రిత్వ శాఖ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో హెడీఎస్‌సీ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్ హరిబాబు, ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ బాలానంద్, ఎస్‌బీఐ చీఫ్ శ్రీనివాసులు, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: హిమాయత్‌నగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఫీడర్లలో సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల మధ్యాహ్నం ఒంటి గంట వరకు సంగంసిటీ, శివసాయినగర్, బైరాగిగూడ, శివపురి, రాంరెడ్డి వెంచర్, గంధంగూడ, భవానీ కాలనీ, రాజీవ్ గృహాలు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు హిమగిరినగర్ కాలనీ, గంధంగూడ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

నేడు పార్కుల ప్రారంభోత్సవం



మణికొండ: మణికొండ పురప్రజలు సేద తీరటంతో పాటు వారికి ఆహ్లాదాన్ని పంచేందుకు అభివృద్ధి చేసిన నాలుగు పార్కులను గురువారం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రారంభిస్తారని మున్సిపల్ కమిషనర్ ఫల్గుణ్‌కుమార్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ ఎల్‌ఐసీ కాలనీలో ఎస్‌ఐసీ పార్కు, అలకాపూర్ టౌన్‌షిప్‌లోని రోడ్డు నెంబర్-7లోని శివాజీ మహారాజ్ పార్క్, రోడ్డు నెంబర్-6లోని ఫ్రీడమ్‌పార్క్, రోడ్డు నెంబర్-30లోని జయశంకర్ పార్కులను ఇటీవల అభివృద్ధి చేశామని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో కావడియాత్ర

అత్తాపూర్: అత్తాపూర్‌లో కావడియాత్ర భక్తిశ్రద్ధలతో జరిగింది. అత్తాపూర్ నర్సింహ్మా స్వామి దేవాలయం నుంచి రాంబాగ్ శివాలయం వరకు కొనసాగిన యాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అత్తాపూర్, రాంబాగ్ తదితర ప్రాంతాల బస్తీలు, కాలనీల్లో కావడి యాత్ర ఊరేగింపు కొనసాగింది.

బీజేపీ నాయకుల పాదయాత్ర



శంషాబాద్ రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఎంతమంది అర్హులకు డబుల్ బెడ్రూమ్‌లు ఇచ్చారో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తెలపాలని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ ప్రశ్నించారు. పట్టణంలోని 13, 14 వార్డుల్లో బుధవారం ఆయన బీజేపీ నేతలతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 9 ఏళ్లుగా డబుల్ బెడ్రూమ్ ఇస్తామంటూ చెప్పడమే తప్ప ప్రభుత్వం అర్హులైన ఒక్కరికి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. నియోజకవర్గ సమస్యలను ఎమ్మెల్యే విస్మరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కొండ ప్రవీణ్ గౌడ్, బీజేవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శి మహేందర్, జ్ఞానేశ్వర్‌యాదవ్, శ్రీనివాస్ యాదవ్, అనిల్, శివ, చారి, రాజేష్ పాల్గొన్నారు.

జోషికుంట పక్కనే సెల్లార్ తవ్వకం

- అడ్డుకున్న అధికారులు



శంషాబాద్ పట్టణంలోని రాళ్లగూడ సర్వీసు రోడ్డు రహదారికి సమీపంలో ఉన్న జోష్ కుంటను ఆనుకుని ప్రైవేటు స్థలం నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా భారీ సెల్లార్ తవ్వకాల చేపట్టారు. బఫర్ జోన్ నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపడుతుండడంతో స్థానికులు మున్సిపాలిటీ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు.బుధవారం టౌన్‌ప్లానింగ్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ అధికారులు సిబ్బంది పనులు నిలిపివేయించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా సెల్లార్ తవ్వకాలు చేపడుతుండడంపై నోటీసులు జారీ చేశారు. అక్రమంగా సెల్లార్ తవ్వినా కట్టడాలు చేపట్టినా చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు హెచ్చరించారు.

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

శంషాబాద్ సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలంటూ చేపట్టిన చలో హైదరాబాద్‌కు బుధవారం ఉద్యోగులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు ఏళ్లుగా చేస్తున్న డిమాండ్‌ను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని సంఘం జిల్లా అధ్యక్షుడు అజీజ్ పేర్కొన్నారు.

వాహనాల తనిఖీలు

శంషాబాద్ రూరల్: మండలంలోని కాచారం, తొండుపల్లి చౌరస్తాల్లో బుధవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలకు నంబరు ప్లేట్లు లేకుండా సరైన పత్రాలను లేని వాటిని సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలన్నారు.

పార్కు అభివృద్ధి పనులు ప్రారంభం

మణికొండ: లేఅవుట్‌లో చూపిన పార్కు స్థలాన్ని కాజేసేందుకు వేసిన ఎత్తుగడను ఆ కాలనీ వాసులు తిప్పి కొట్టారు. 13 ఏళ్ల క్రితం నాటి హోంమంత్రి సబితాఇంద్ర రెడ్డి పార్కు అభివృద్ధికి శంకుస్థాపన చేసినా కోర్టు కేసులతో ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. ఎట్టకేలకు ప్రస్తుత మున్సిపల్ కమిషనర్ ఫల్గుణ్‌కుమార్, ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ నాయకులు వారికి అండగా నిలిచి 600 గజాల స్థలాన్ని సాధించుకున్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మారుతినగర్ కాలనీ ఏర్పాటు చేసే సమయంలో 1100 గజాల పార్కు స్థలాన్ని లేఅవుట్‌లో చూపారు. కాలనీలో కొందరు నివాసం ఏర్పాటు చేసుకున్న తర్వాత తమ పార్కు స్థలాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ప్రయత్నించారు. అప్పటి హోం మంత్రి సబితారెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన సైతం చేసుకున్నారు. అంతలోనే లేఅవుట్ చేసిన వ్యక్తి కోర్టుకు వెళ్లటంతో అది పెండింగ్‌లోనే పడింది. ఈ విషయంలో పలుమార్లు 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలతో అడ్డుకట్ట పడింది. ఇటీవల పలు సర్వేలు చేపట్టి అందులోని 600 గజాల స్థలంపై వివాదం లేదని తేల్చి దాన్ని పార్కుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. దాంతో బుధవారం స్థానిక కౌన్సిలర్ డి. పురుషోత్తం కాలనీ వాసులతో కలిసి పార్కు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఎట్టకేలకు తమ కాలనీలో పార్కు అభివృద్ధికి నోచుకోవడంతో వారంతా హర్షం వ్యక్తం చేశారు.



పార్కు పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ పురుషోత్తం

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులను చేపడుతూ ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర వెల్లడించారు. బుధవారం హిమాయత్‌సాగర్‌లోని కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రకటనల టాక్స్ వసూలు చేయాలని హరితహారంలో ప్రజలను భాగస్వాములు చేసి మొక్కలు నాటేలా చూడాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, తడి, పొడి చెత్తపై ప్రజలకు మరింత అవగాహన అవసరమన్నారు. ప్రజలు చెత్తను చెత్త సేకరణ కార్మికులకు అందించేలా అధికారులు, సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇంటి పన్ను వసూలులో జాప్యం వహించ రాదని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు అర్హులైన ప్రజలకు అందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ నిర్మల, టౌన్‌ప్లానింగ్ అధికారిణి విజయలక్ష్మి, ఎంహెచ్‌వో డాక్టర్ రవి, అకౌంట్స్ ఆఫీసర్ కృష్ణయ్య, టీఎంసి శ్రీలత, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రత్‌చంద్ర

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి మహాధర్నా



ధర్నాలో పాల్గొన్న అపార్ట్‌మెంట్ వాసులు

రాజేంద్రనగర్: తమ ప్రాంతంలోని డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలంటూ ఉప్పర్‌పల్లి ఆశోక్ విహార్ సొసైటీ వీఎస్ఆర్ అపార్ట్‌మెంట్ వాసుల మహాధర్నా బుధవారం 6వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..ఎగువ ప్రాంతం నుంచి డ్రైనేజీ నీరు తమ ప్రాంతంలోకి వచ్చి నిలుస్తుందన్నారు. గత 4-5 ఏళ్లగా ఈ సమస్యతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా ఏ ఒక్కరు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. డ్రైనేజీ నీటిలోనే రాకపోకలు సాగిస్తుండటంతో వృద్ధులు, చిన్నారులు అనారోగ్య బారిన పడుతున్నారని వాపోయారు. సమస్య పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని చివరకు తామే పిల్లాపాపలు, వృద్ధులతో కలిసి తమ బస్తీలోనే ధర్నాకు దిగామన్నారు. బుధవారం బీఆర్ఎస్ నాయకుడు సామ ఇంద్రపాల్‌రెడ్డి వారితో మాట్లాడి ఫోన్‌లో ఎమ్మెల్యేతో పాటు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. శివరాంపల్లిలోని ప్రభుత్వ పాఠశాల కార్యక్రమానికి హాజరైన మంత్రి సబితాఇంద్రారెడ్డి దృష్టికి సైతం తీసుకువెళ్లారు.

చిత్రపురిలో విజయ భాస్కర్‌రెడ్డి విగ్రహావిష్కరణ

మణికొండ: చిత్రపురి కాలనీ నిర్మాణానికి 67 ఎకరాలను కేటాయించిన నాటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని బుధవారం చిత్రపురి కాలనీ ప్రవేశంలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శబ్దాలయ అధినేత, నిర్మాత శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, నిర్మాతలు సి.కల్యాణ్, దిల్‌రాజు, తమ్మారెడ్డి భరద్వాజ్, దామోదర ప్రసాద ప్రసన్నకుమార్, చిత్రపురి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్ మాట్లాడారు. కార్మికులు చెన్నై నుంచి వచ్చి పనిచేయాల్సి వస్తుందని, సమయానికి రాకపోవటంతో షూటింగ్‌లు నిలిచిపోతున్నాయని నటుడు, దర్శకుడు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారన్నారు. దాంతో ఆయన వెంటనే ప్రభుత్వ పరంగా తాను సినీ పరిశ్రమకు అండగా నిలుస్తానని ప్రకటించి మణికొండలో 67 ఎకరాలకు కార్మికులకే కేటాయించారని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం నాలుగు వేల మంది చిత్ర కార్మికులు చిత్రపురి కాలనీలో నివసిస్తున్నారన్నారు. కాలనీ నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు హౌసింగ్ సొసైటీ పూర్తి స్థాయిలో కృషి చేస్తుందన్నారు. ప్రభాకర్‌రెడ్డి, దాసరి నారాయణరావుల కృషితోనే కోట్ల విజయభాస్కర్‌రెడ్డి సహకారంతోనే చిత్రపురి కాలనీ ఏర్పడిందని, అందుకే వారందరి విగ్రహాలను నెలకొల్పామన్నారు.



కోట్ల విజయభాస్కర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించిన సినీ ప్రముఖులు

మంత్రి, ఎమ్మెల్యేకు శివరాంపల్లి వాసుల వినతి

రాజేంద్రనగర్: శివరాంపల్లి గ్రామాన్ని ఓపెన్ స్పేస్ జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్‌లోకి మార్చాలని ఐక్యత వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బుధవారం అధ్యక్షుడు పి.వెంకటేష్ ఆధ్వర్యంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ మండల పరిధిలోని శివరాంపల్లి గ్రామం చాలా ఏళ్లగా నివాసాలు ఏర్పాటు చేసుకుని ప్రజలు జీవిస్తున్నారు. గత పదేళ్లగా ఈ గ్రామాన్ని ఓపెన్ స్పేస్ జోన్‌గా మార్చారని దీనివల్ల శివరాంపల్లి పరిధిలోని ప్రశాంత్ కాలనీ, వీకర్‌సెక్షన్ కాలనీ, శ్యామలనగర్ తదితర బస్తీలలో ఇళ్లు నిర్మించుకునేందుకు మున్సిపల్ అనుమతులు ఇవ్వడం లేదన్నారు. ఈ విషయంలో తగు చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరగా ఆమె సానుకూలంగా స్పందించారని సభ్యులు పేర్కొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి



మాట్లాడుతున్న ఏసీపీ రాంచందర్‌రావు

శంషాబాద్: వ్యాపార సంస్థలు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని శంషాబాద్ ఏసీపీ రాంచందర్‌రావు సూచించారు. ఆర్‌జీఐఏ పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని వ్యాపార సంస్థలు, ఫంక్షన్‌హాళ్ల యజమానులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఏసీపీ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఆర్‌జీఐఏ సీఐ శ్రీనివాస్,డీఐ రాజు, ఎస్ఐ సుమన్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన..

శంషాబాద్ రూరల్: ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరు నియమ, నిబంధనలను పాటించాలని ఏసీపీ రాంచందర్‌రావు సూచించారు. త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికల నేపథ్యంలో బుధవారం మండలంలోని పాల్మాకులలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా తీసుకోవాల్సిన జాగ్రతలు, ఏర్పాట్ల వివరాలపై స్థానికులతో చర్చించారు. సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాధాన్యం వివరించారు. సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, మాదక ద్రవ్యాల అడ్డుకట్టకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ పాల్గొన్నారు.



అంత్యక్రియలకు అవస్థలు

శ్మశానవాటికల్లో మౌలిక సదుపా యాలు లేకపోవడంతో స్థానికులు ఇక్కట్లు పడుతున్నారు. ఓ వైపు డ్రైనేజీ పొంగడం, మరోవైపు కచ్చా రోడ్లతో అవస్థలు పడుతున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ ఒకప్పుడు గ్రామం, కొన్నాళ్ల పాటు మున్సిపాలిటీ, ప్రస్తుతం జీహెచ్ఎంసీ ఆధీనంలో ఉంది. అత్తాపూర్ అనే బ్రాండ్ విశ్వనగరానికి ప్రత్యేకతను చాటి చెబుతుంది. శ్మశానవాటికలో ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి శ్మశానవాటికలో సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

–అత్తాపూర్



దేశాభివృద్ధిలో వాజ్‌పేయి పాత్ర కీలకం



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు



వాజ్‌పేయి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

శంషాబాద్: భారత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. భారతదేశాభివృద్ధిలో వాజ్‌పేయి పాత్ర కీలకమన్నారు. రాజకీయ నేతలకు ఆయన మార్గదర్శకులన్నారు. కార్యక్రమంలో ప్రేమ్ రాజ్, నందకిశోర్ గుప్తా, వేణుగోపాల్, శ్రీధర్, మహిపాల్‌రెడ్డి, కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

హైదర్‌గూడ చౌరస్తాలో..

అత్తాపూర్: భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమాన్ని అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ చౌరస్తాలో బుధవారం నిర్వహించారు. అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాబాద విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. అటల్ బిహారీ ఉన్నతమైన పరిపాలన మార్గ నిర్దేశకుడని రాజకీయాలకు అతీతంగా అభిమానాన్ని సంపాదించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేష్‌యాదవ్, కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్, కిరణ్‌చారి, జయానంద్‌రెడ్డి, నల్లింగ్ రమేష్, మోండ్ర నర్సింహ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఉపాధ్యాయులు

బండ్లగూడ: ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించి విద్యావ్యవస్థను కాపాడాలని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు కన్నయ్యగారి గోవర్ధన్‌యాదవ్ డిమాండ్ చేశారు. హైదర్షాకోట్, ఖానాపూర్, వట్టినాగులపల్లి, కోకాపేట్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీలలో పీఆర్‌టీయూటీఎస్ రంగారెడ్డి జిల్లా శాఖ సభ్యత్వ నమోదు వారోత్సవాల సందర్భంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించి బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు చక్కటి విద్యను అందించడంలో ముందుకు పోవాలని కోరారు. పెండింగ్ బిల్స్ 2002-23 సీపీఎస్ ఉపాధ్యాయులకు ఓపీఎస్ సాధిస్తామన్నారు. వచ్చే శాసనసభ ఎన్నికల కన్నా ముందు తమ సమస్యలు పరిష్కరించకపోతే ధర్నాలు, నిరాహార దీక్షలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో గండిపేట మండల శాఖ అధ్యక్షులు మల్లేష్, ప్రధాన కార్యదర్శి బి.నర్సింహులు, గౌరవ అధ్యక్షులు కిరణ్, రాష్ట్ర బాధ్యులు యాదయ్య, రవిబాబు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మండల పరిధిలోని లక్ష్మిగూడ వాంబే కాలనీలో భవన నిర్మాణ కార్మికుల నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు బచ్చలకూర స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి సీఐటీయూ రాజేంద్రనగర్ మండల కన్వీనర్ జె.కురుమయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలు ఉంటే వాటిని రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ల విధానాన్ని తీసుకొచ్చి కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. వ్యవసాయ చట్టాలను కూడా మారిస్తే రైతులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఢిల్లీ నడి బొడ్డున పోరాటం చేసి వ్యవసాయ రంగాన్ని నిలబెట్టుకున్న తీరు హర్షించదగ్గ విషయమన్నారు. వాంబే కాలనీ నూతన అధ్యక్షుడిగా ఎస్.సిద్ధార్థ, కార్యదర్శిగా డి.స్వామి, ఉపాధ్యక్షుడు జె.వెంకటేష్, గౌరవ అధ్యక్షులుగా గాలెన్న, కోశాధికారిగా ఎం.వెంకటేష్, సహాయ కోశాధికారిగా పి.దాసు, కార్యనిర్వహణ అధికారిగా డి.కురుమయ్య, కె.నాగరాజు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, యాదగిరి, దాసరి శంకర్, నరసింహ, విజయ్‌కుమార్, గురురాజు, శ్రీకాంత్, మహేష్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న భవన నిర్మాణ కార్మికులు

పరిసరాల పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం ముఖ్యం

అత్తాపూర్: పరిసరాల పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ వెల్లడించారు. అత్తాపూర్ డివిజన్ పరిధిలోని రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, సెక్రెటరీలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తను ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు అందించాలన్నారు. ఖాళీ స్థలాలు, రోడ్లకు ఇరువైపులా సీఅండ్‌డీ, చెత్తా చెదారాలు, వ్యర్థాలను డంప్ చేయరాదన్నారు. రోడ్లపై ఖాళీ ప్రదేశాల్లో డంప్ చేసే వారికి గుర్తించి జరిమానా విధించాలన్నారు. ఆటో రిక్షా కార్మికులకు ఇళ్ల వద్దకు రాకపోతే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.



మాట్లాడుతున్న ఉప కమిషనర్ రవికుమార్